క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్ మహేంద్ర బాధ్యతల స్వీకరణ



పెడన: పెడన మున్సిపల్ కమిషనర్ మహేంద్ర సోమవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా ఉన్న అంజయ్య సీడీఎంఏ కార్యాలయంలో రిపోర్టు చేయనున్నారు. మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు మహేంద్రకు ఘనంగా సత్కరించి, స్వాగతం పలకగా, అంజయ్యకు వీడ్కోలు పలికారు.

మంత్రి జోగి రమేష్‌ని కలిసిన కమిషనర్

పెడన మున్సిపల్ కమిషనర్ బి.మహేంద్ర రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి రమేష్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పెడనలోని మంత్రి కార్యాలయంలోని మంత్రి రమేష్‌ను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. పురపాలక సంఘాభివృద్ధికి కృషి చేయాలని, విధులు పట్ల అంకితభావంతో పనిచేయాలని సూచించారు. మంత్రితో పాటు పురపాలక సంఘ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, కౌన్సిలర్లు బళ్ల గంగయ్య, మెట్ల గోపీ ప్రసాద్, శిరివెళ్ల జయేష్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బందారు మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ముగిసిన కనకదేశమ్మ తల్లి జాతర



కృత్తివెన్ను: చినగొల్లపాలెం దీవిలో రెండు రోజులుగా జరుగుతున్న శ్రీ కనకదేశమ్మతల్లి జాతర మహోత్సవం సోమవారంతో ముగిసింది. దీవిలో ఎన్నో దశాబ్దాలుగా పూజలందుకుంటున్న అమ్మవారికి మూడేళ్లకు ఒకసారి గ్రామస్తులు జాతర నిర్వహిస్తారు. ఎంతో పేరుగాంచిన ఈ జాతర మహోత్సవానికి తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ జాతరలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఇంటికి బంధువుల రాకతో దీవి జనసంద్రమైంది.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



బంటుమిల్లి: మండల పరిధిలోని ముంజులూరు గ్రామంలో సోమవారం శ్రీ విజయగణపతి, మూషిక వాహన విగ్రహ ప్రతిష్ఠలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా జరుగుతున్న ప్రతిష్ఠ కార్యక్రమాలు సిద్ధి, బుద్ధి సమేత విఘ్నేశ్వరస్వామివారి శాంతి కల్యాణంతో ముగిశాయి. పండితులు లంక శ్రీరామచంద్రమూర్తిశర్మ శిష్య బృందం వేద మంత్రాల మధ్య ఉదయం విగ్రహ ప్రతిష్ఠ, గణపతి హోమం పూర్ణాహుతి వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన చేవేంద్ర వెంకటేశ్వరరావు, లక్ష్మీకాంతమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు విగ్రహాలు బహూకరించి ప్రతిష్ఠ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అన్నసమారాధనలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

పింఛనుదారుల ఆర్థిక సాయం



మచిలీపట్నంటౌన్: నగరంలోని 41వ డివిజన్‌లో మృతి చెందిన వైఎస్సార్ సామాజిక పింఛన్ లబ్ధిదారుడు యడ్ల అప్పలనాయుడు కుటుంబానికి తోటి పింఛనుదారులు ఆర్థిక సాయం అందజేశారు. మే 31వ తేదీన అప్పలనాయుడు మృతి చెందటంతో తోటి పింఛనుదారులు ఒక్కొక్కరూ రూ.100లు చొప్పున సేకరించిన రూ.27,300లు అప్పలనాయుడు కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో నగర డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, ఆర్ఎంపీ వైద్యుడు భవానీశంకర్, న్యాయవాది చీలి ముసలయ్య పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం



మచిలీపట్నంటౌన్: పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన నగరంలోని టిక్యా ప్రాంతానికి చెందిన పేద విద్యార్థిని షేక్ రుక్సానాకు సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. జవ్వారుపేట శ్రీ వేంకటేశ్వర పబ్లిక్ స్కూల్‌లో చదివిన రుక్సానా టెన్త్‌లో 521 మార్కులు సాధించిందన్నారు. ఆమె ఉన్నత చదువుల కోసం తమ సంస్థ ద్వారా ఆర్థిక సాయం అందించామని చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు షేక్ నూర్జహాన్, ఎన్ఆర్ఐ అబ్దుల్‌షఫీ, ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా, ముస్లిం ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు షేక్ మౌలాలి, షేక్ బాషు, సాంబశివరావు, ప్రసాద్, షఫీ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

అవనిగడ్డ: పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మన టీవీ భవనంలో ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ వాహనాల వాడకం పెరిగిపోవడం, చెట్లను నరికివేయడం, ప్లాస్టిక్ వాడకం పెరగడం వల్ల పర్యావరణానికి పెనుముప్పు పొంచి ఉందన్నారు. చెట్లను నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా స్మార్ట్ సొల్యూషన్ ఫర్ ఎకో పొల్యూషన్ ప్రాజెక్టుని రూపొందించి కృష్ణాజిల్లాకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన పెడన జెడ్పీహైస్కూల్ బయాలజీ టీచర్ కొల్లాటి లక్ష్మీదేవి, విద్యార్థులు మణికంఠ, వినయ్‌కుమార్‌ని ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే సింహాద్రి, ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు కళాశాల మైదానంలో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ శాంతకుమారి, ఫిజిక్స్ అధ్యాపకురాలు సంధ్యశ్రీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

చల్లపల్లి: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని ఎమ్మెల్యే రమేష్ బాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. కారుణ్య యూత్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సేవా సంస్థ, విజయవాడ ముత్తూట్ ఫైనాన్స్, ఐసీడీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే రమేష్ బాబు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహరావు ముఖ్య అతిథులుగా విచ్చేసి కార్యాలయ ప్రాంగణంలో కొబ్బరి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలన్నారు. కారుణ్య యూత్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద



చల్లపల్లిలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, వేదికపై ప్రజాప్రతినిధులు, అధికారులు

సేవా సంస్థ అధ్యక్షులు తూము మధుసూదనరావు ముత్తూట్ ఫైనాన్స్ సహకారంతో చేపట్టిన కార్యక్రమం అభినందనీయమన్నారు. అనంతరం ముత్తూట్ ఫైనాన్స్ సీఎస్ఆర్ నిధులతో కారుణ్య యూత్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సేవా సంస్థకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ సిస్టం, స్క్రీన్, ప్రింటర్, ల్యాప్‌టాప్ ఎమ్మెల్యే చేతులమీదుగా బహూకరించారు. నాయకులు మోపిదేవి ద్వారకానాథ్, ఎంపీడీఓ అరుణ కుమారి, తహసీల్దార్ గోపాలకృష్ణ, ఐసీడీఎస్ సీడీపీఓ భానుమతి, సూపర్‌వైజర్ ఆదిలక్ష్మి, సర్పంచ్‌లు వల్లూరు ఉమా, తోట శ్రీనివాసరావు, గొరిపర్తి సురేష్ బాబు, పీఏసీఎస్ చైర్మన్ పాగోలు ఫణి, నాయకులు తుమ్మల వెంకటేశ్వరరావు, మద్దాల వీరాస్వామి, బొందలపాటి లక్ష్మి, యడ్ల జగదీష్, ముత్తూట్ ఫైనాన్స్ సీఎస్ఆర్ మేనేజర్ యామగాని లక్ష్మీనారాయణ, మేనేజర్లు బీవీఎస్ హరీష్, గుండు లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలి



మొక్క నాటుతున్న బాషా తదితరులు

కోసూరువారిపాలెం(మోపిదేవి): ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని నిషేధించాలని గ్రామ సర్పంచ్ కోసూరు అనూష సూచించారు. మండల పరిధిలోని కోసూరువారిపాలెంలో సర్పంచ్ అధ్యక్షతన సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రపంచ పర్యావరణ రక్షణలో భాగంగా ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించాలని కోరారు. అనంతరం పలు కార్యక్రమాలపై గ్రామసభలో చర్చించారు. గ్రామ కార్యదర్శి ఉప్పాల వెంకటేశ్వరావు మాట్లాడుతూ.. ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో గ్రామ వలంటీర్లు తప్పని సరిగా గ్రామ సచివాలయం వద్దకు రావాలని సూచించారు. సచివాలయ గ్రామ కార్యదర్శి షహనా, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

పెడన: మొక్కలను ప్రతి ఒక్కరూ నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని సహాయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఉస్మాన్‌బాషా అన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెడన శాఖ గ్రంథాలయంలో సోమవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో రౌతుల ప్రసాద్, కాగత సాంబశివరావు, గ్రంథాలయ అధికారి బసవేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్స్యకారులు, బీసీల సంక్షేమానికి జగనన్న పెద్దపీట

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- ఏటిమొగలో గడప గడపకు మన ప్రభుత్వం

ఏటిమొగ(నాగాయలంక): రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు గతంలో ఎవరూ చేపట్టలేదని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. నాగాయలంక మండలంలోని తీరగ్రామం ఏటిమొగ సచివాలయం పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే నేతృత్వంలో చేపట్టారు. మత్స్యకారుల సంక్షేమానికి అనేక ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ప్రజల ఆశీస్సులే సీఎం పాలనకు ప్రజారక్షగా నిలుస్తుందని చెప్పారు. మత్స్యకారులు, బీసీల అభివృద్ధికి సీఎం పెద్దపీట వేశారన్నారు. అనంతరం



ఏటిమొగలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు తదితరులు

ఎమ్మెల్యే రమేష్‌బాబు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

సీఎం పరిపాలనా దక్షతకు నిదర్శనం

గ్రామంలోని 350 గృహాలకు వెళ్లి ప్రభుత్వం ద్వారా పొందిన సంక్షేమ పథకాల లబ్ధి వివరాలను ఎమ్మెల్యే రమేష్‌బాబు ఆయా కుటుంబాలకు చదివి వినిపించి సంబంధిత జాబితాలను వారికి అందచేశారు. మ్యానిఫెస్టోలో పేర్కొన్న హామీలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 98శాతం అమలు చేసి దేశంలోనే రికార్డు సృష్టించారని, ఇదే ఆయన పరిపాలనా దక్షతకు నిదర్శనమని ఎమ్మెల్యే గ్రామస్తులకు వివరించారు. సంక్షేమ పథకాల లబ్ధి అందుతుందీ లేనిదీ ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ భోగాది శేషగిరిరావు, గ్రామ సర్పంచ్ నాయుడు ఉమాదేవి, ఎంపీటీసీ సభ్యురాలు విశ్వనాథపల్లి నాగలక్ష్మి, నంద్యాల కోటేశ్వరరావు, వెలుగు సీసీ అనంతలక్ష్మి, గ్రామ ప్రజాప్రతినిధులు, వీఆర్వో, వివిధ శాఖలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, మండల పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పీఎస్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవిలో నూతనంగా నిర్మాణంలో ఉన్న పోలీస్ స్టేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ ఆదేశించారు. రూ.1.40 కోట్లతో అత్యాధునిక హంగులతో నిర్మిస్తున్న పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. స్టేషన్‌లో విద్యుత్ ఏర్పాటు, రంగులు పరిశీలించి త్వరగా పనులు పూర్తి చేయాలని చెప్పారు. నిర్మాణం పూర్తయిన అనంతరం ముందుగా జిల్లా ఎస్పీ పోలీస్ స్టేషన్ పరిశీలించిన అనంతరం ప్రారంభ తేదీ ఖరారు చేస్తామన్నారు. ఆయన వెంట చల్లపల్లి సీఐ భీమేశ్వర రవికుమార్, ఎస్ఐ పద్మ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



మోపిదేవిలో అధికారులకు సూచనలిస్తున్న అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్

రీ సర్వే పూర్తి.. గెజిట్ నోటిఫికేషన్ విడుదల

పెడన: మండలంలోని నేలకొండపల్లి, కుమ్మరిగుంట గ్రామాల్లో రీ సర్వే పూర్తి కావడంతో వాటికి సంబంధించి గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేస్తున్నట్లు రీ సర్వే డెప్యూటీ తహసీల్దార్ పి.సత్యనారాయణ తెలిపారు. ఆయన తన చాంబర్‌లో ఈవోపీఆర్డీ జయరామ్, పంచాయతీ కార్యదర్శి మీరాలతో పాటు పెనుమల్లి, గురువిందగుంట గ్రామ సచివాలయాలకు చెందిన గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు, సర్వేయర్‌తో కలిసి సోమవారం రీ సర్వేపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రీసర్వే పూర్తి కావడంతో పాటు ఆయా గ్రామాల్లో పూర్తి సమాచారాన్ని సిద్ధం చేశామని గ్రేడ్-5 కార్యదర్శులు డీటీకి వివరించారు. అసెస్‌మెంట్లకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలుంటే వాటిని తెలియజేయడానికి గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వాలని డీటీ సత్యనారాయణ వారికి సూచించారు. తహసీల్దారు కార్యాలయంతో పాటు ఎంపీడీవో కార్యాలయంలోను, ఆయా గ్రామ



సమీక్షిస్తున్న డీటీ సత్యనారాయణ, ఈవోపీఆర్డీ జయరాం తదితరులు

సచివాలయాల్లోని నోటీసు బోర్డుల్లో ఈ గెజిట్ నోటిఫికేషన్ ఉంచాలన్నారు. ఈ నెల 13న నేలకొండపల్లి, కుమ్మరిగుంట గ్రామాల్లో గ్రామసభలను ఏర్పాటు చేసి అభ్యంతరాలను తెలియజేసే వారి నుంచి ఆధారాలతో లిఖితపూర్వకంగా తీసుకోవాలని సూచించారు.

సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు

మచిలీపట్నంటౌన్: కృష్ణాజిల్లా నుంచి ఈ నెల 7వ తేదీ బుధవారం 1,814 మంది ముస్లింలను హజ్‌యాత్రకు పంపేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు మీర్జా రియాజ్ హుస్సేన్ సోమవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. కృష్ణాజిల్లా గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి వీరంతా హజ్ యాత్రకు వెళ్లేందుకు ఒక్కొక్కరికి రూ.80 వేల భారం పడినా ఈ మొత్తాన్ని సీఎం జగన్ ఆదేశాలతో ప్రభుత్వం చెల్లించిందన్నారు. బుధవారం హజ్ యాత్రికులతో తొలి విమానం గన్నవరం నుంచి బయలుదేరటం ఆనందదాయకమని చెప్పారు.

అర్బన్‌లో రీ సర్వేకు ట్యాబ్‌ల అందజేత

పెడన: అర్బన్‌లో రీ సర్వే చేయడానికి వార్డు సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలకు సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ అంజయ్య మాట్లాడుతూ.. పట్టణంలో ఇప్పటికే డ్రోన్ కెమెరా ద్వారా ఇమేజ్‌లను సేకరించామని, ఆ ఇమేజ్‌లకు సంబంధించి క్షేత్రస్థాయిలో ప్లానింగ్ సెక్రటరీలు వెళ్లి డ్రోన్ ఇమేజ్‌లకు, క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితులకు సరిపోయింది లేనిది పరిశీలించాలన్నారు. ఈ పరిశీలన నిమిత్తం ట్యాబ్‌లను అందించామని చెప్పారు. కార్యక్రమంలో టీపీవో ఏసుబాబు, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శీతలపానీయం పంపిణీ

కోడూరు: వాసవీ కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాహన చోదకులకు, పాదచారులకు శీతలపానీయాన్ని పంపిణీ చేశారు. స్థానిక ప్రధాన సెంటర్‌లో క్లబ్ ఆధ్వర్యంలో 400 మందికి రస్నాను అందించారు. ఎండలు తగ్గే వరకు ఈ పంపిణీ ప్రతి రోజు కొనసాగుతుందని క్లబ్ సభ్యులు తెలిపారు. క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మద్దాళి ప్రసాద్, అధ్యక్షుడు దేసు మల్లికార్జునరావు, ప్రధాన కార్యదర్శి అరవపల్లి శివరామకృష్ణ, కోశాధికారి కోడూరు వెంకటసత్యనారాయణ, క్లబ్ ఆర్గనైజర్ అన్నం శివరామకృష్ణ పాల్గొన్నారు.

ఇతర ప్రాంతాలకు వెళ్లి పింఛన్ల అందజేత

పెడన: మండలంలోని కొంకేపూడి గ్రామానికి చెందిన దావు వెంకటేశ్వరరావు గాల్‌బ్లాడర్‌లో రాళ్లు ఉండటంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. దీంతో పింఛన్ తీసుకోలేదు. పింఛన్ పంపిణీ గడువు ముగుస్తుండటంతో విషయం తెలిసిన వలంటీర్ ఉప్పలపాటి నాగలక్ష్మి విజయవాడ ఆసుపత్రికి వెళ్లి వెంకటేశ్వరరావుకు వృద్ధాప్య పింఛన్ రూ.2,750లను సోమవారం ఉదయం అందజేసింది. దీంతో వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వలంటీర్‌ను అభినందించారు.

డోకిపర్రుకు వెళ్లి..

మచిలీపట్నంటౌన్: నగరంలోని 29వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్ సామాజిక పింఛన్ లబ్ధిదారురాలు అమీరున్నీసా బైపాస్ సర్జరీ చేయించుకుని డోకిపర్రులో బంధువుల వద్ద ఉంటోంది. విషయం తెలుసుకున్న ఆ డివిజన్ కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు ఆమెకు పింఛను అందించాలని వలంటీర్ రేకపల్లి సుష్మాకు సూచించటంతో ఆమె సోమవారం డోకిపర్రు వెళ్లి అమీరున్నీసా కు పింఛను సొమ్మును అందజేసింది. వలంటీర్ సుష్మాకు కార్పొరేటర్ కేదారేశ్వరరావుకు పింఛనుదారురాలు అమీరున్నీసా కృతజ్ఞతలు తెలిపారు.



అమీరున్నీసాకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సుష్మా

వడదెబ్బకు గొర్రెల కాపరి మృతి

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండల పరిధిలోని ఘోటకం ఏ కాలనీకి చెందిన బొమ్ము వెంకటేశ్వరరావు(54) గొర్రెలు మేపడానికి వెళ్లి వడదెబ్బ తగిలి మరణించాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం వెంకటేశ్వరరావు సోమవారం మధ్యాహ్నం గొర్రెలను మేపేందుకు సమీపంలోని పొలంలోకి వెళ్లాడు. గొర్రెలు మేపుతుండగా వడదెబ్బకు గురవడంతో సొమ్మసిల్లి పడిపోయాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వెంటనే ఘటనా స్థలికి చేరుకోవడంతో అప్పటికే మరణించాడు. మృతునికి భార్య ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కనులపండువగా శాంతి కల్యాణోత్సవం

కోడూరు: కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివార్ల శాంతి కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్ఛరణల నడుమ ఉదయం ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలను జరిపారు. అనంతరం స్వామివార్లను ఆలయం చుట్టూ ఊరేగించారు. ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణవేదికపై శాంతి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. కోడూరుకు చెందిన వ్యాపారవేత్త అద్దేపల్లి మోహనబాబు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. పండితులు మొవ్వ రఘుశేఖరప్రసాద్ వ్యాఖ్యాతగా వ్యవహరించి, కల్యాణంలోని విశేషాలను వివరించారు. రాత్రికి ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ నిర్వహించారు. మంగళవారం ఆలయం వద్ద మహా అన్నసమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు.



కల్యాణాన్ని నిర్వహిస్తున్న పండితులు, తిలకిస్తున్న భక్తులు

పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్

- జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు
- కానూరులో ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం

కోనేరుసెంటర్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని ఆయన అమలు పరుస్తున్న ప్రతి ప్రభుత్వ పథకం పేదల కోసమేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు తెలిపారు. మండల పరిధిలోని కానూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం రెండో రోజైన సోమవారం కొనసాగింది. వేకువజామునే కిట్టు ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నవరత్నాల కరపత్రాలను ప్రజలకు అందజేసి, వాటిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. గ్రామంలోని పలువురు వృద్ధులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పుణ్యమా అంటూ ప్రతి నెలా ఒకటో తేదీ ఠంఛన్‌గా పింఛన్‌లు ఇచ్చేస్తున్నారయ్యా అంటూ ఆనందం వ్యక్తం చేయగా మరికొందరు మహిళలు అమ్మ ఒడి పథకం ద్వారా మా పిల్లల చదువులకు ఎలాంటి ఆటంకం లేకుండా సాగిపోతున్నాయంటూ సంతోషం వ్యక్తం చేశారు.

విద్యావంతులను చేయడమే లక్ష్యం

ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ.. పిల్లల చదువు కోసం ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. నాడు - నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేయటంతో పాటు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో విద్యాబోధన జరుగుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను విద్యావంతులను చేయాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. ఆయన లక్ష్యానికి అనుకూలంగా మీరంతా మీ పిల్లలను బడులకు పంపి విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెక్కా ఆదిలక్ష్మి, ఉప సర్పంచ్ గోపు మురళీ, గ్రామ ఇన్‌చార్జి చెక్కా ఏడుకొండలు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గణపాబత్తుల చూడామణి, సొసైటీ అధ్యక్షుడు బొమ్మిడి సత్యనారాయణ, వార్డు సభ్యుడు గణపాబత్తుల సత్యనారాయణ, గ్రామ పెద్ద చెక్కా నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న పేర్ని కిట్టు

అతిసార వ్యాధి నివారణ పక్షోత్సవాలు నిర్వహించాలి

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా వ్యాప్తంగా అతిసార వ్యాధి నివారణకు పక్షోత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని కలెక్టర్ పి.రాజాబాబు వైద్యాధికారులను ఆదేశించారు. ఆయన చాంబర్‌లో సోమవారం అతిసార వ్యాధికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. ఐదేళ్ల ఉన్న పిల్లల్లో డయేరియా మరణాలను తగ్గించటమే లక్ష్యమన్నారు. ఆశా కార్యకర్తలు ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరఫరా చేయాలని చెప్పారు. వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి సోకిన పిల్లలకు 14 రోజుల పాటు మందులు వేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో గీతాబాయి, వైద్యులు శర్మిష్ఠ, జి.భారతి, కె.రత్నగిరి, బి.రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

అతిసార పక్షోత్సవాలు ప్రారంభం

పెదప్రోలు(మోపిదేవి): డయేరియా వ్యాధి సోకిన పిల్లలు తప్పనిసరిగా 14 రోజుల పాటు జింకు, ఓఆర్ఎస్ తీసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ కె.హారిక సూచించారు. మండలంలోని పెదకళ్లేపల్లి పీహెచ్‌సీ పరిధిలోని పెదప్రోలు గ్రామ సచివాలయం వద్ద సోమవారం అతిసార పక్షోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ హారిక మాట్లాడు తూ.. ఈనెల 5 నుంచి 17వ తేదీ వరకు గ్రామాల్లో అతిసార పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. పిల్లలకు విరోచనాల సమయంలో తల్లిపాలు ఇతర నోటి ద్రావణాలు, అనుబంధ ఆహారం నిర్విరామంగా అందించాలని చెప్పారు. మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. ఓఆర్ఎస్, జింక్ మాత్రలకు మీ సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలను సంప్రదించాలని సూచించారు. డాక్టర్ శ్రీరామ్ సాయి మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలను పెంచాలన్నారు. ప్లాస్టిక్‌ను నిర్మూలించి గుడ్డ సంచులు ఉపయోగించాలని చెప్పారు. పీఏసీఎస్ చైర్మన్ ఆది రాంబాబు, గ్రామ కార్యదర్శి పేర్ని మాధవేంద్రరావు, హెల్త్ ఎడ్యుకేటర్ వి.రాధ, వై.విజయసారధి, సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజాబాబు, అధికారులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేత

బంటుమిల్లి: సమగ్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని బంటుమిల్లి ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు నిండిన 202 మంది చిన్నారులను తర్వాత చదువుల కోసం సోమవారం సర్టిఫికెట్లు అందజేశామని సీడీపీవో సముద్రవేణి తెలిపారు. ఈ సర్టిఫికెట్ల ద్వారా చిన్నారులు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జాయిన్ అవుతారన్నారు. బంటుమిల్లి కోర్టు ఏరియాలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ వి.కృష్ణవేణి ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారుల్లోని సృజనాత్మకతను పరీక్షించి సర్టిఫికెట్లు అందచేసి ఆనందం వ్యక్తం చేశారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి తీర్చిదిద్దారని తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగలక్ష్మీ, ప్రసూన, సచివాలయ కార్యదర్శులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బంటుమిల్లిలో చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సర్పంచ్ కృష్ణవేణి తదితరులు

స్వామివార్లకు పుష్పయాగ ఉత్సవం

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో వేం చేసి ఉన్న శ్రీ రంగనాయకస్వామి, శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివార్ల వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. రంగనాయకస్వామి ఆలయంలో స్వామివారికి ద్వాదశ ప్రదక్షిణలు, శ్రీ పుష్పయాగోత్సవం(పవళింపు సేవ) కార్యక్రమాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కొల్లిపర వెంకటరామారావు, మౌనిక దంపతుల ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ఈవో కందుల వేణుగోపాలరావు పర్యవేక్షించారు. అలాగే శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి శ్రీ పుష్పోత్సవం ఓకంటి వెంకటరెడ్డికుమార్, సునీత దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం బిందితీర్థం, బలిహరణ, అభిషేకాలు, పూజ కైంకర్యాలు, శివపంచాక్షరి, మహామంత్రానుష్టానం నిర్వహించారు. రాత్రి కొత్తపల్లి వేణుమాధవ్ భాగవతార్‌చే ద్రౌపతి మానసంరక్షణ హరికథ కాలక్షేపం జరిగింది. కార్యక్రమాలను ఆలయ ఈవో సమ్మెట ఆంజనేయస్వామి పర్యవేక్షించారు.

నగరంలో నీటి సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: నగరంలోని హెడ్‌వాటర్ వర్క్స్ నుంచి చిలకలపూడికి వెళ్లే ప్రధాన పంపింగ్ మెయిన్ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడింది. దీంతో మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టారు. చల్లరాస్తా సెంటరు వద్ద ఉన్న ఎయిర్‌ఫిట్ వద్ద మరమ్మతు పనులు సోమవారం చేపట్టారు. దీని కారణంగా సోమవారం, మంగళవారం రెండు రోజుల పాటు నగరంలోని 23 వార్డుల్లో నీటి సరఫరా నిలిచిపోయింది. మరమ్మతు పనులను పూర్తి చేసి బుధవారం ఉదయం 11 గంటల నుంచి నీటి సరఫరా చేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ జి.చంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు తాగునీటి సరఫరా నిలిచిపోవటంతో ప్రజలకు నీటి కష్టాలు తప్పటం లేదు.